క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో ఎగ్జిక్యూటివ్ మెంబర్ పప్పల లక్ష్మణ్

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితుడైన పప్పల లక్ష్మణ్ సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీలో తన నియామకంపై కె.కె.రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఈ బైక్ ఎవరిది?



ఆర్పీ పేట హైస్కూల్ రక్షణ గోడను ఆనుకుని వదిలేసిన బైక్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని తుప్పుపట్టిన ఓ బైక్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. పాఠశాల ప్రధాన ద్వారానికి ఆనుకుని బైక్ ఉండటంతో అటుగా వెళ్లే విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది బైక్ పార్క్ చేసిన ప్రాంతంలో రోడ్లు ఊడ్చకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు హైస్కూల్ రక్షణ గోడకు ఆనుకుని మురుగు నిలిచిపోయింది. దోమలు చేరి అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. బైక్‌ను తరలించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణ శిబిరానికి హాజరైన బీఎల్‌వోలు

మహారాణిపేట: వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ కోసం జిల్లా యంత్రాంగం సమయాత్తమవుతోంది. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్ర అధికారుల(బీఎల్‌వో) శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. విశాఖ దక్షిణ, తూర్పు, ఉత్తర, పశ్చిమ, భీమిలి, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని బీఎల్‌వోలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన శిక్షణ శిబిరాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు లచ్చాపాత్రుడు, మధుసూదనరావు, డీటీ జిలానీ తదితరులు పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు మూడే వినతులు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బి.రాము వినతులను స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి పాల్గొన్నారు.

మెగా పేరెంట్ మీటింగ్‌కు ఏర్పాట్లు

మద్దిలపాలెం : మెగా పేరెంట్ మీటింగ్ మద్దిలపాలెం జూనియర్ కళాశాల వేదికగా ఈ నెల 10న నిర్వహించనుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఆహార నాణ్యత పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్ మీటింగ్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యేలా అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ వేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



అక్కయ్యపాలెం దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు



మిషన్‌పై కుట్టడం నేర్చుకుంటున్న మహిళలు

కుట్టు శిక్షణ.. ఉపాధికి నిచ్చెన



క్లాత్ కటింగ్ నేర్చుకుంటున్న మహిళలు

- స్థానిక మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు
- బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో నిర్వహణ
- శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందజేత
- రూ.2 లక్షల వరకు 50% రాయితీతో రుణాలు

సీతంపేట: మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొందేలా టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార సంస్థ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 90 రోజుల శిక్షణ తర్వాత 75 శాతం హాజరు తక్కువ కాకుండా హాజరైన మహిళలకు సర్టిఫికెట్‌తోపాటు ఒక కుట్టు మిషన్ ఉచితంగా ఇవ్వనున్నారు. దీంతో చాలా మంది మహిళలు ఆసక్తి చూపిస్తూ కుట్టు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు.

నియోజకవర్గంలో ఐదు చోట్ల..

ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం శ్రీనివాస నగర్‌లో గల దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపం, కంచరపాలెం రాంజీ ఎస్టేట్ కప్పరాడ సామాజిక భవనం, మద్రిపాలెం 104 ఏరియా, సీతమ్మధార అల్లూరి విగ్రహం వద్ద గల సచివాలయంలో మొత్తం ఐదు చోట్ల కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. 43వ వార్డు శ్రీనివాసనగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లుగా మహిళలు శిక్షణ పొందుతున్నారు. 42, 43, 44, 45 వార్డులకు చెందిన మహిళలు ఉదయం 40 మంది, సాయంత్రం 38 మంది శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. ఒక్కో కేంద్రంలో 60 నుంచి 70 మంది మహిళలు శిక్షణకు హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అక్కయ్యపాలెంలో ట్రైనర్లు పి.వరలక్ష్మి, జి.లోవకుమారి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ అంశాలు..

టైలరింగ్‌లో బేసిక్స్ నుంచి మొదలు పెట్టి జుబ్బాలు, ఫ్రాక్స్, గాగ్రా, లంగా, జాకెట్లు, డ్రెస్సులు, చుడీదార్స్, స్కర్టులు, బ్లౌజుల క్లాత్ కటింగ్ ఎలా చేయాలి, కొలతలు ఎలా తీసుకోవాలి, మిషన్‌పై ఎలా కుట్టాలో నేర్పిస్తున్నారు.

70 రోజుల హాజరు తప్పనిసరి..

మూడు నెలల శిక్షణలో భాగంగా కనీసం 70 రోజులు తరగతులకు హాజరు కావాల్సి ఉంది. బయోమెట్రిక్ ద్వారా హాజరు లెక్కిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, యువతులు కుట్టు పని నేర్చుకునేలా ప్రాధాన్యమిస్తున్నారు. అన్ని రకాల దుస్తులు కుట్టడం నేర్చుకుని స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్‌తోపాటు కుట్టు మిషన్ ఉచితంగా అందజేస్తారు. రూ.2 లక్షల వరకు 50% రాయితీతో రుణాలు ఇప్పిస్తారు.

నా బ్లౌజులు నేనే కుట్టుకుంటా...



ఇటీవల కాలంలో చీర కొంటే దాని ఖర్చుకంటే బ్లౌజు, శారీ ఫాల్స్, జిగ్‌జాగ్ ఖర్చులే అధికంగా ఉంటున్నాయి. బ్లౌజు బయట కుట్టించాలంటే ధరలు చూసి భయమేస్తోంది. అందుకే నేనే సొంతంగా బ్లౌజులు కుట్టాలని శిక్షణకు హాజరవుతున్నాను. రెండు నెలలుగా శిక్షణకు హాజరవుతున్నాను. ఫ్రాక్స్, చుడీదార్స్, గాగ్రా, బ్లౌజులు కటింగ్, కుట్టడం నేర్చుకున్నాను. ఇక మీదట నా బ్లౌజు నేనే కుట్టుకుంటా. పిల్లల దుస్తులు కూడా ఇంట్లోనే కుట్టేస్తా.

– బి.అమ్ములు, గృహిణి, రామచంద్రానగర్

రెండు బ్యాచ్‌లుగా శిక్షణ



మహిళలు స్వయం ఉపాధి పొందేలా కుట్టు పనిలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో రెండు బ్యాచ్‌లుగా 78 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణ ముగిశాక సర్టిఫికెట్, కుట్టుమిషన్ ఉచితంగా అందజేస్తాం. దీంతోపాటు 50 శాతం రాయితీతో రూ.2 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ రుణంతో శిక్షణ పూర్తయ్యాక సొంతంగా వ్యాపారం పెట్టుకునే అవకాశం కలుగుతుంది.

– జి.లోవకుమారి, శిక్షకురాలు

భర్త సంపాదనకు చేదోడుగా..



ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఇల్లు గడవాలంటే భార్యాభర్తలిద్దరూ కష్టపడాల్సిన రోజులివి. భర్త సంపాదనకు చేదోడు వాదోడుగా ఉండాలంటే మహిళలు స్వయం ఉపాధి సాధించాలి. ఉచిత కుట్టు శిక్షణకు క్రమం తప్పకుండా హాజరవుతున్నాను. మిషన్ ఫ్రీగా ఇస్తామన్నారు. ఇంట్లో కూర్చుని ఖాళీ సమయాల్లో బ్లౌజులు, డ్రెస్సులు కుట్టి కొంత వరకు డబ్బులు సంపాదించవచ్చు. లేదా ప్రభుత్వం ఇచ్చే రుణంతో షాపు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉంది.

– బి.లీలావతి, నందగిరినగర్, అక్కయ్యపాలెం

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు





అయ్యప్పనగర్ వద్ద 48 బస్ రూట్ రహదారిలో సరిచేసిన యూజీడీ మ్యాన్‌హోళ్లు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన యూజీడీ మ్యాన్‌హోళ్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మాధవధార–మురళీనగర్ 48 బస్ రూట్‌లో గతంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా రహదారి మధ్యలో మ్యాన్‌హోళ్లు నిర్మించారు. వీటితో పాటు ప్రధాన రహదారికి అనుబంధ రహదారిని కలిపే చోట ఇవి ఉన్నాయి. భూ ఉపరితలానికి ఎత్తుగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. ముఖ్యంగా అయ్యప్పనగర్ రహదారి మధ్యలో మ్యాన్‌హోళ్లు ఎక్కువగా ఉండడంతో ప్రమాదా లు సంభవిస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు స్పందించి దారి పొడవునా ఉన్న మ్యాన్ హోళ్లను రహదారికి సమాంతరంగా సరిచేశారు.

భీమిలిలో కంటి ఆస్పత్రి నిర్మాణానికి సహకారం



ఎమ్మెల్యే గంటాకు జ్ఞాపిక అందిస్తున్న రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ నూతన కార్యవర్గ సభ్యులు

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ భీమిలి నియోజకవర్గంలో త్వరలో నిర్మించబోయే రోటరీ కంటి హాస్పిటల్‌కు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం దొండపర్తిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా గంటా మాట్లాడుతూ రోటరీ క్లబ్ అంతర్జాతీయంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. వీటిలో భాగంగా భీమిలి నియోజకవర్గంలో రూ.3 కోట్లతో కంటి ఆస్పత్రి నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కంటి ఆస్పత్రి స్థాపన కోసం రోటరీ క్లబ్ 3020 డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ సిహెచ్.కిషోర్‌కుమార్ రూ.59.50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చింతా నేతాజీ, పి.భాస్కర్ నరేంద్ర జగన్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎం.డి.యాసిన్, జి.కె.మూర్తి, టి.ఎస్.రావు, బచ్చు బ్రహ్మానందం, డాక్టర్ అశోక్, బి.శంకర్, టి.సురేష్, డాక్టర్ ఎస్.ఎస్.రాజు, సిహెచ్.కామేశ్వరరావు, వి.ప్రవీణ్, డాక్టర్ నరేష్ సప్పా, కె.ఎం.కె.రమేష్, ఎస్.వెంకటేష్, బి.సునీల్, కె.ఫిరోజ్‌ఖాన్, ఎస్.కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములు స్వాధీనం చేసుకోండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం నాయకులు

బీచ్‌రోడ్డు : జీవో 596కు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసిన 6 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి ఎస్సీలకే కేటాయించాలని విదసం(విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. అసైన్డ్ భూముల్లో అక్రమాలు సరిదిద్ది దళితులకు న్యాయం చేయాలని కోరుతూ విదసం నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. ఉమ్మడి విశాఖ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దళిత శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 3 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు హక్కుదారుల పేర్లు, రికార్డులను మాయం చేసి కబ్జాకోరులు వారి పేరున ఫ్రీ హోల్డ్ చేసుకున్నారన్నారు. అటువంటి వారి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సలహా ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రయవిక్రయాలు ఒకే సామాజిక వర్గం మధ్యలో జరిగేలా జీవో సవరించాలన్నారు. శారదా పీఠం నుంచి వెనక్కి తీసుకున్న భూములను రామ్‌దేవ్ బాబాకు కేటాయించే ప్రతిపాదన మంచిదికాదని హితవు పలికారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భూ కుంభకోణంపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు రెండు సిట్‌లు వేశాయని, అందులో 700 ఎకరాల అసైన్డ్ భూముల తోపాటు 2 వేల ఎకరాల భూముల అక్రమాలు జరిగాయని సిట్ నివేదిక ఇస్తే.. ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదన్నారు. సభాధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ తెనాలిలో ముగ్గురు యువకులను పోలీసులు నడిరోడ్డు మీద చితక్కొట్టిన ఘటనపై ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బానాస నుంచి టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళితవాడను వెలివేస్తే కనీసం కేసు నమోదు కాలేదని, వెంటనే ఈ దురాగతాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.చిన్నారావు, తంటడి కిరణ్‌కుమార్, కొత్తపల్లి వెంకటరమణ, బాగం గోపాల్ పాల్గొన్నారు.

మట్టి వినాయక బొమ్మల తయారీ



అక్కయ్యపాలెంలో మట్టి వినాయక బొమ్మల తయారీని ప్రారంభించిన కళాకారులు

సీతంపేట: వినాయక చవితికి రెండు నెలలకు ముందే కోల్‌కతా, ఒడిశా కళాకారులు నగరానికి వచ్చి మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తుంటారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో సరుగుడు కర్రలు, గడ్డి, మట్టి, హానికరం కాని రంగులు ఉపయోగించి ఏటా వినాయక ప్రతిమలు తయారు చేసి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని మూడు గుళ్ల సమీపాన ఖాళీ స్థలంలో కోల్‌కతా కళాకారులు బొమ్మల తయారీని ప్రారంభించారు. శంకరమఠం పక్కన ఖాళీ స్థలంలో కూడా కొద్ది రోజులుగా మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. రెండడుగుల నుంచి 15 అడుగుల వరకు మట్టి బొమ్మలు తయారు చేస్తామని, ఆర్డర్లు బట్టి 100 నుంచి 120 వరకు వివిధ ఆకృతుల్లో బొమ్మలు తయారు చేస్తున్నట్టు కళాకరులు తెలిపారు. కాన్సెప్ట్ చెబితే దాని ప్రకారం బొమ్మ తయారు చేస్తామని, మట్టి బొమ్మల కోసం ఆర్డర్లు స్వీకరిస్తున్నామన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



కాళ్ల గోవిందమ్మను వానప్రస్థ వృద్ధాశ్రమానికి తీసుకొస్తున్న రొబ్బి శ్రీనివాస్

మురళీనగర్: నవమాసాలు మోసి.. కని పెంచిన తల్లిదండ్రులను వారి బిడ్డలు ఆలనా పాలనా చూసుకోలేక రోడ్డును వదిలేస్తున్న సంఘటనలు నేడు సర్వసాధారణమై పోయాయి. తమ బిడ్డలు ఉన్నత స్థానంలో ఉంటే వారిని చూసి మురిసిపోయే తల్లిదండ్రులు వృద్ధాప్యం చేరగానే వారిని నిరాశ్రయులను చేస్తున్న పిల్లలున్నారు. దీంతో వీరు దిక్కు తోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇలా కాళ్ల గోవిందమ్మ(72) అనే వృద్ధురాలిని ఆమె కుటుంబీకులు మద్దిలపాలెం వద్ద వదిలి వెళ్లిపోయిన విషయం పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాస్ దృష్టికి వచ్చింది. ఈ మేరకు ఆయన మద్దిలపాలెంలో రహదారిపై దిక్కుతోచని స్థితిలో ఉన్న గోవిందమ్మను ఆమె అంగీకారంతో సోమవారం ఆశ్రమానికి తీసుకొచ్చారు. ఆమె సంరక్షణకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. శ్రీనివాస్ సేవలను పలువురు ప్రశంసించారు.

ఆటోల బంద్ విజయవంతానికి పిలుపు



నిరసన తెలుపుతున్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆటోలు బంద్ పాటించి ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటోలకు ఎఫ్‌సీలు, డ్రైవింగ్ లైసెన్సుల మంజూరును ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని, పాత పద్ధతిలోనే ప్రభుత్వమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వాహనమిత్ర పథకం రూ.15 వేలు వెంటనే ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి జీవోలు 21, 31 రద్దు చేయాలన్నారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 9న బంద్ పాటించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవికృష్ణ, జి.నీలకంఠం, పి.సాయికుమార్, జి.ఆదినారాయణ, జి.అప్పారావు, బి.బుజ్జి, కె.వెంకట్, జి.టి.కృష్ణ, ఎం.చిన్న, పైడిరాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్టీలు తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వరంగల్ జిల్లాకు చెందిన దుగ్యాల రాజ్‌కుమార్ విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.10 వేల విలువైన 2 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు

మహారాణిపేట: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. సోమవారం శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలు జర్నలిస్టుల సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇతర జిల్లాల్లో జర్నలిస్టుల కోసం అమలు చేస్తున్న ఉత్తర్వులను కూడా ఆయనకు అందజేశారు. జర్నలిస్టులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని, దీనిపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే స్కూల్ ఫీజు రాయితీ ఉత్తర్వులు కూడా తక్షణమే అందజేయాలని డీఆర్‌వో భవాని శంకర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ్, కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఎస్.ప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఉచిత విద్య'కూ ఫీజుల డిమాండ్



కలెక్టర్ కార్యాలయంలో వినతులు అందించి వస్తున్న తల్లిదండ్రులు

మహారాణిపేట: నగరంలో ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్లకు పలు కార్పొరేట్ స్కూళ్లు నిరాకరిస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది. భాష్యం స్కూల్ యాజమాన్యం ఉచిత సీట్లలో చేరిన తమ పిల్లల ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అనేక మంది తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసి కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల వైఖరిపై ఫిర్యాదు చేశారు. నగరంలోని భాష్యం, లిటిల్ ఏంజిల్స్, రామకృష్ణ తదితర పాఠశాలల్లో ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు తమకు ఫోన్ మెసేజ్ రావడంతో ఆ పాఠశాలల్లో చేర్చామని, ఇప్పుడు ఫీజు, పుస్తకాలు, ఇతర ఫండ్‌ల పేరిట డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్‌కు వినతులు అందించిన వారిలో ఎస్.కిషోర్(నక్కవానిపాలెం), బి.సత్యనారాయణ(వెంకోజీపాలెం), పి.సుధాకర్(హనుమంతవాక), కృష్ణారావు(ఎన్ఏడీ కొత్తరోడ్డు), రామలక్ష్మి(బుచ్చిరాజుపాలెం) తదితరులు ఉన్నారు.